ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 27.0
కనిష్ఠం : 24.0

ముంచెత్తింది..

జిల్లా వ్యాప్తంగా అతిభారీ వర్షాలు


నూజివీడు - పోతురెడ్డిపల్లి రహదారిపై రామిలేరు వరదలో నీటిలో చిక్కుకున్న మహిళలను ఎక్స్‌కవేటర్ సాయంతో రక్షిస్తున్న దృశ్యం


బత్తులవారిగూడెంలో చెరువుకు గండి పడిన దృశ్యం

- ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాలు జలమయం
- నూజివీడుని చుట్టుముట్టిన పెద్ద చెరువు నీరు
- చెరువులకు గండ్లు.. నేలకొరిగిన వృక్షాలు
- ప్రభుత్వ కార్యాలయాల్లోకి వాన నీరు
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు : మంత్రి కొలుసు
- అన్నిశాఖలు అప్రమత్తం : కలెక్టర్ వెట్రిసెల్వి
- ఏలూరుకు తమ్మిలేరు ముప్పు

బంగాళాఖాతంలో పడిన అల్ప పీడనంతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ, అతి భారీ వర్షాలు కురిశాయి. పల్లపు ప్రాంతాలు జలమయ మయ్యాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. అనేక చోట్ల వృక్షాలు నేలకూలాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ప్రభుత్వాస్పత్రులు, కార్యాలయాల్లోకి వర్షపునీరు చేరింది. కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో కార్యాలయాలతో సహా ఎక్కడికక్కడ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగాన్ని మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు. వర్షాలు మరింత కురిసే అవకాశం ఉన్నందున ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.


ముసునూరు మండలం చెక్కపల్లి అంబేద్కర్ కాలనీలో బసవరపుపాడు వాగు వరద ఉధృతి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోను లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కొనసాగడంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలను మూసివేశారు. కొన్ని చోట్ల శనివారం మధ్యాహ్నం నుంచి విద్యార్థులను ఇళ్లకు పంపేశారు. నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువుకు గండి పడడంతో సమీపంలోని నివాస ప్రాంతాల్లోకి వరదనీరు చొచ్చుకువెళ్ళింది. పెద్ద సంఖ్యలో కుటుంబాలు జల దిగ్బంధనానికి గురయ్యాయి. ఒక్కసారిగా వరద నీరు చొచ్చుకురావడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. ఇంకొందరు ఇంటికి ఇంటికి మధ్యన తాళ్ళు కట్టుకుని మరీ సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు ప్రయత్నించారు. మంత్రి పార్థసారథి నీట మునిగిన ప్రాంతాలను సందర్శించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో ఉన్న స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా ఆదేశించారు. నూజివీడులో ఉదయం నుంచి వర్షాలు కురిసిన కారణంగా మిగతా ప్రాంతాలు నీట మునిగిన తరుణంలోనే ఇంకోవైపు పెద్ద చెరువుకు గండి పడడంతో నూజవీడు పట్టణంలో భయానక పరిస్థితి నెలకొంది. మరోవైపు నూజివీడు సమీపాన రామిలేరు ఒడ్డున ఉన్న ఒక ప్రాంతంలో ఫంక్షన్‌కు హాజరైన కొంతమంది వరద నీటిలో చిక్కుకున్నారు. వారందరినీ అధికారులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. ఇంకోవైపు మరికొన్ని చెరువులకు గండ్లు పడే అవకాశం ఉండడంతో ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. ఇక నూజివీడు పెద్దచెరువు గండిపడిన ప్రాంతం నుంచి భారీగా వరదనీరు రావడంతో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఒక్క నూజివీడులోనే భారీ వర్షాలకు అతి పెద్ద నష్టం జరిగినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. కైకలూరు నియోజకవర్గంలోను భారీ వర్షాల తాకిడికి జాతీయ రహదారితోపాటు మిగిలిన లింకు రోడ్లు జలమయమయ్యాయి. ఈ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది.


ఏలూరు శ్రీనివాస థియేటర్ సమీపంలో రోడ్డు ఇలా..

కంట్రోల్ రూములు ఇవే...
కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ : 1800 233 1077, 94910 41188
ఐటీడీఏ కోటరామచంద్రపురం : 08821-232221
ఆర్డీవో ఆఫీస్, ఏలూరు : 08812-232044, 9491041424
ఆర్డీవో ఆఫీస్, జంగారెడ్డిగూడెం : 8309705048
ఆర్డీవో ఆఫీస్, నూజివీడు : 08656-232717
విద్యుత్ శాఖ : 94409 02926
ఏలూరు నగరపాలక సంస్థ : 08812-222200, 232101

ఆస్పత్రి, ప్రభుత్వ కార్యాలయాల్లోకి నీరు

ఏలూరులోని జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు కైకలూరులోని ఎంపీపీ కార్యాలయంలోకి నీరుచేరింది. కుండపోతగా వర్షం కురియడం ఒక ఎత్తయితే, లోతట్టుగా ఉన్న ప్రాంతాలన్నింటినీ వర్షపునీరు కమ్మేసింది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలోపే నివాసాల్లోకి నీరు చేరింది. ఏలూరు ప్రభుత్వాస్పత్రి వర్షపునీటితో నిండిపోయింది. మోటార్లతో నీటిని తోడిస్తూనే ఉన్నా మరో వైపు వర్షం పడుతూనే ఉంది. సాయంత్రానికి నీటిని తోడించగలిగారు. నగరంలో ప్రధాన రహదారులతోపాటు వివిధ డివిజన్లలో ఉన్న మార్గాలన్నీ


నీట మునిగిన ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణ

మోకాళ్ల లోతు నీటిలో మునిగాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు కష్టతరమయ్యాయి. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, స్థానిక అధికారులు డ్రెయిన్లలో నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకున్నా జనం తీవ్ర అవస్థలకు గురయ్యారు. మరో వైపు తమ్మిలేరు రిజర్వాయరులోకి క్రమేపీ నీరు వచ్చి చేరుతోంది. తమ్మిలేరు దిగువన ఏలూరువైపు శనివారం సాయంత్రం నాటికి తమ్మిలేరులో నీటి మట్టం అనూహ్యంగా పెరిగింది. దీంతో తమ్మిలేరు పరివాహక ప్రాంతంలో అధికారులను అప్రమత్తం చేయడమే కాకుండా జిల్లా ఎస్పీ ప్రతాప శివకిశోర్ తమ్మిలేరు తూర్పులాకులను పరిశీలించి జాగ్రత్తలు సూచించారు. అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. ఇప్పటికే ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ఏ క్షణాన్న అయినా విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ప్రజలను అప్రమత్తం చేసింది. రానున్న రెండు, మూడు రోజుల్లో వర్షాలు కొనసాగే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని అన్ని విభాగాల అధికారులకు ఆదేశాలు అందాయి.


నూజివీడులో పెద్దచెరువు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి సారథి

సురక్షిత ప్రాంతాలకు చేర్చండి
మంత్రి పార్థసారథి

'ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రాణ, ఆస్తి నష్టాలు జరగడానికి వీల్లేదు. ముందస్తు చర్యలు తీసుకోవాలి. శిథిలావస్థలో ఉన్న పూరిగుడిసెలు, భవనాల్లో ఉన్న ప్రజలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి' అంటూ అధికారులను మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశించారు. శనివారం అత్యవసరంగా కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 'సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అందరూ అప్రమత్తం కావాలి. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకకుండా అన్ని ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి. చెట్లు కూలిన చోట్ల రవాణాకు ఎటువంటి ఆటంకం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. భారీ వర్షాల కారణంగా వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పశువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి. క్లోరినేషన్ చేసిన తాగునీటినే ప్రజలకు సరఫరా చేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత లోతట్టు ప్రాంతాల్లో నీటిని బయటకు తొలగించాలి. ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. జ్వరాలు విజృంభించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లోను పాముకాటుకు సంబంధించి మందులను అందు బాటులో ఉంచాలి. వరద ఉధృతి ఎక్కువగా ఉండే కాజ్‌వేలను మూసివేయాలి. ఎక్కడికక్కడ మండల అధికారులు పరిస్థితిని సమీక్షించి తక్షణ చర్యలకు దిగాలి. కుక్కునూరు, వేలేరుపాడు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ఆరా తీశారు.


ఏలూరులోని లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

భారీ వర్షాల కారణంగా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదల, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, పశు సంవర్థక, గృహ నిర్మాణం అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి. కల్వర్టుల వద్ద కాపలా ఉంచాలి. రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసే ముందు రెవెన్యూ శాఖకు సమాచారం అందించాలి. వైర్లు తెగిపడి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే కంట్రోల్ రూములను ఏర్పాటు చేశాం' అని తెలిపారు. తమ్మిలేరు వరద దృష్ట్యా ఏలూరు అర్బన్ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ రెవెన్యూ, ఇరిగేషన్, కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. సాయినగర్, కొమడవోలు, శనివారపుపేట కాజ్‌వే ప్రాంతాలను పర్యటిస్తూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులకు సూచనలు ఇచ్చారు.


నూజివీడులో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్


మండవల్లి పీహెచ్‌సీ చుట్టూ చేరిన వర్షంనీరు


పెదపాడు మండలం గోగుంటలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు

రైల్వే హెల్ప్‌లైన్లు ఏర్పాటు

ఏలూరు క్రైం : భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తుగా ప్రయాణికుల రక్షణార్థం అన్ని జాగ్రత్త చర్యలు తీసు కున్నామని ప్రయాణికులు, ప్రజలు ఎప్పటికప్పుడు రైళ్ల రాకపోకలు, రైళ్ల రద్దు సమాచారం తెలుసుకోవడానికి హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధి కారులు తెలిపారు. ఈ మేరకు విజయవాడ డివిజన్‌లోని విజయవాడ - 7569305697, రాజమండ్రి - 0883- 2420 541, 2420543, తుని - 7815 909479, నెల్లూరు - 78159 09479, ఒంగోలు - 781590 9489, గూడూరు - 08624- 250795, గుడివాడ - 781590 9462, భీమవరం టౌన్ - 7815909402, నిడదవోలు - 08813- 223325, తాడేపలి గూడెం - 08818- 226162, తెనాలి - 08644- 227600, ఏలూరు - 7851909348 నెంబర్లకు కాల్ చేసి సమా చారం తెలుసుకోవచ్చన్నారు.

జల్లేరు జలాశయం గేట్లు ఎత్తివేత

బుట్టాయగూడెం/పోలవరం: శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం గేట్లను ఎత్తి దిగువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. ఏజెన్సీలో భారీవర్షాలు కురుస్తున్న జలాశయంలోకి వాగుల ద్వారా 300 క్యూసెక్కుల వరదనీరు వస్తోందన్నారు. జలాశయం నీటిమట్టం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 216 ఎంటీఎస్ ఉన్నందున నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. జలాశయం ప్రాంతంలో 38 ఎంఎం వర్షం కురిసినట్టు తెలిపారు. పోలవరం ఏజెన్సీ ప్రాంతాల్లో కొండవాగులు పొంగి గుంజవరం, తానాలకుంట, రేపల్లెవాడ, జిల్లేళ్లగూడెం, నరిపల్లికుంట, సున్నాల గండి కల్వర్టుల నుంచి ప్రవహిస్తున్నాయి. ఎల్ఎన్‌డీ పేట కొవ్వాడ రిజర్వా యర్ నుంచి విడుదల చేసిన జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.

ముదినేపల్లిలో 238.6 మి.మీ వర్షపాతం నమోదు

ఏలూరు సిటీ : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో గడచిన 35 గంటల్లో (శుక్రవారం ఉదయం 8గంటల నుంచి శనివారం రాత్రి 8గంటల వరకు) జిల్లాలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 238.6 మిల్లీ మీటర్లు (23.8 సెంటీమీటర్లు) వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 122.8 మి.మీ నమోదైంది. కైకలూరులో 229.6, ఆగిరిపల్లి 221.8, మండవల్లి 196.6, ముసునూరు 191.8, నూజివీడు 187.4, కలిదిండి 166.8, పెదవేగి 163.2, లింగపాలెం 154.8, చాట్రాయి 139.2, ఏలూరు రూరల్ 130.4, జంగారెడ్డిగూడెం 127.2, వేలేరుపాడు 125, ఏలూరు అర్బన్ 121.4, కుక్కునూరు 102, పెదపాడు 97, భీమడోలులో 93.8, నిడమర్రు 93.8, కామవరపుకోట 89.2, దెందులూరు 88, ద్వారకా తిరుమల 86.2, కొయ్యలగూడెం 69.8, బుట్టాయిగూడెం 66, ఉంగుటూరు 58.6, టి.నరసాపురం 55.4, చింతలపూడి 53.4, జీలుగుమిల్లి 47.2, పోలవరం 42.8 మి.మీ వర్షపాతం నమోదైంది.


దర్శనానంతరం బయటకు తడుస్తూ వస్తున్న భక్తులు

ద్వారకా తిరుమలలో భక్తుల పాట్లు

ద్వారకాతిరుమల : జోరున వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా వేలాదిగా భక్తులు శ్రీవారి క్షేత్రానికి శని వారం విచ్చేశారు. వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తడుచుకుంటూనే ఆలయంలోకి ప్రవేశించగా కొందరు గొడుగు, టవల్స్ వంటి ప్రత్యామ్నాయాలను వినియోగించారు.

వర్షాలు తగ్గే వరకు సెలవుల్లేవు..

భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు తగ్గేంతవరకూ సిబ్బందికి సెలవులు లేవని డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్ స్పష్టం చేశారు. ద్వారకా తిరుమల పంచాయతీ కార్యాలయాన్ని, గ్రామంలోని డ్రెయినేజీ వ్యవస్థను, తాగునీరు, బోర్లు, పారిశుధ్య నిర్వహణను ఈవోపీఆర్డీ ఏవీ సుబ్బరాయన్‌తో కలసి శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వర్షాల కారణంగా పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా.. లేదా అన్నది ఆరా తీశారు.

పెద్దవాగులో ఒకరి గల్లంతు..?

నూజివీడు : భారీ వర్షాలకు శని వారం ఆగిరిపల్లి మండలం వట్టిగుడి పాడుకు చెందిన వీర్రాజు అనే వ్యక్తి వాగులో గల్లంతైనట్టు తెలిసింది. శనివారం సాయంత్రం వట్టిగుడిపాడు నుంచి నూజివీడు మండలం పొలసానపల్లికి వెళుతూ మధ్యలో ఉన్న పెద్దవాగు వరదలో చిక్కుకుని వీర్రాజు గల్లంతైనట్టు సమాచారం.


వర్షంలోను పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 92 శాతం అందజేత

ఏలూరు సిటీ, ఆగస్టు 31 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమం శనివారం జోరువర్షంలో ప్రారంభమైంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఉదయం 6గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌లను అందజేశారు. ఆగస్టు 31వ తేదీ ఆదివారం కావడంతో సెప్టెం బరు పింఛన్‌లను ఒక రోజు ముందుగానే ఆగస్టు 31వ తేదీ శనివారం అందజేశారు. ఒక రోజు ముందుగా పింఛన్లు అందజేయడం ఇదే తొలిసారి. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు వర్షాలతో పింఛన్‌లు పంపిణీ చేసే 605 సచివాలయాల పరిధిలోని 5104 మంది సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకారం అందించారు. జిల్లాలో 2,65,992 మంది లబ్ధిదారులకు రూ.113.67 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం సాయంత్రం 6 గంటల నాటికి జిల్లాలో 2,43,692 మందికి (92శాతం) పంపిణీ చేశారు. ఏలూరు 50 వడివిజన్‌లోని ఎంఆర్‌సి కాలనీలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌పెదబాబుతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పింఛన్ సొమ్ములను పింఛన్‌దారులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ పథకం ద్వారా జిల్లాలో 2,65,992 మందికి రూ.113.67 కోట్లు అందజేస్తున్నట్టు తెలిపారు. ఏ కారణం చేతైనా పింఛన్ తీసుకోనివారికి సోమవారం అందిస్తామన్నారు. కాగా ప్రజా శ్రేయస్సు కోసం చిత్తశుద్ధి, అంకిత భావంతో కృషి చేసే ప్రభుత్వం ఉంటే ప్రభుత్వ అధికారులు కూడా బ్రహ్మాండంగా పనిచేస్తారనడానికి శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమే నిదర్శనమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో సైతం సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాగాన్ని , సచివాలయ సిబ్బందిని మంత్రి అభినందించారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు మేయర్ నూర్జహాన్

సీఎం సీరియస్



- ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- డైరెక్టర్ తొలగింపు.. త్రిసభ్య కమిటీ ఏర్పాటు
- మంత్రి పార్థసారథి రెండోసారి ఆకస్మిక తనిఖీ
- మళ్లీ అదే ఆహారం.. మెస్ నిర్వాహకులపై ఆగ్రహం
- మరో 59 మందికి జ్వరాలు.. వైద్య చికిత్స


మెస్‌లో మంత్రి పార్థసారథి తనిఖీ

నూజివీడు, ఆగస్టు 31: నూజివీడు ట్రిపుల్ ఐటీని గాడిన పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వారం రోజులుగా కలుషిత ఆహారం కారణంగా వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై విద్యార్థులు ఇక్కడి సమస్యలను లేఖ ద్వారా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా క్యాంపస్‌లో వరుస పరిణామాలపై సీరియస్ అయ్యారు. విద్యార్థుల ఆహారం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో పర్యవేక్షణకు త్రిసభ్య కమిటీని మంత్రి నారా లోకేశ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలో కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యా శాఖ ఇన్‌చార్జ్ చైర్మన్ రామ్మోహన్ రావు, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని సభ్యులుగా నియమించారు. కమిటీ దృష్టి సారించే పలు అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులకు అంది స్తున్న ఆహార నాణ్యత నిర్వహణకు, క్యాంపస్‌లో పారిశుధ్యం, మెస్ పరిశుభ్రతకు ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొటోకాల్ అమలు. లైంగిక వేధింపులపై ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్న వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి' అని ఉత్తర్వుల్లో మంత్రి పేర్కొన్నారు.

నాణ్యత లేని ఆహారం వల్లే జ్వరాలు : మంత్రి

ట్రిపుల్ ఐటీలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలపై సీఎం చంద్ర బాబు సీరియస్‌గా ఉన్నట్టు మంత్రి పార్థసారథి విలేకరులకు తెలిపారు. శనివారం రెండోసారి ఆయన క్యాంపస్‌ను సందర్శించి మెస్‌లోని వంటశాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నాణ్యత లేని ఆహారం, పారిశుధ్యం లేకపోవడంతోనే విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. గత జగన్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, మెస్‌ఛార్జీలు చెల్లించకపోవడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడింది. క్యాంపస్‌లో ప్రతి మెస్‌కు (మిగతా 6పేజీలో)

4 నుంచి మద్యం దుకాణాల సిబ్బంది నిరసనలు

భీమవరం క్రైం, ఆగస్టు 31 : రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం పాడాలనే నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందిని రోడ్డున పడవేయవద్దని యూనియన్ నాయకులు వేడుకుంటున్నారు. ఐదేళ్ళ నుంచి తమకు కనీస వేతనం కూడా సమయానికి అందడంలేదని, పీఎఫ్, ఈఎస్ఐలతో పాటు ఓటీలు కూడా ఏజెన్సీలు తినేశాయన్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అయినా తమకు మంచిరోజులు వచ్చాయని ఆశపడ్డామని పేర్కొన్నారు. కాని నూతన ప్రభుత్వమే మద్యం దుకాణాలు ప్రైవేటు పరం చేసి తమను రోడ్డున పడేయబోతున్నట్లు అనేక ప్రసార మాధ్యమాలు ద్వారా ప్రచారం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల ప్రైవేటు ప్రచారంపై కూటమి ప్రభుత్వం దాగుడుమూతలు ఆడకుండా తమకి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, లేనిపక్షంలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 4వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అవసరమైతే 7న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్ పిలుపునివ్వడం జరుగుతుందని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరుతున్నారు.

జవహర్ నవోదయ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఎడ్యుకేషన్, ఆగస్టు 31 : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో 2025 జనవరి 18న నిర్వహించనున్న సెలక్షన్ టెస్ట్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ పరీక్షకు అర్హులు. ఈ జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్‌లో ఉత్తీర్ణులై ఎంపికైన వారికి 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరుటకు అవకాశం ఉందన్నారు. కావున జిల్లాలోని అన్ని యజమాన్య పాఠశాలల్లో ఈ సంవత్సరం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కంటతడి పెట్టిస్తున్న శునకం విశ్వాసం


యజమాని ఫొటో ఎదుట శునకం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: యజమాని చనిపోయాడన్న విషయం జీర్ణించుకోలేక ఆ యజమాని ఫొటో ముందు ఒక శునకం (రాకీ) దీనంగా చూస్తున్న దృశ్యం చూపరులను కంటతడి పెట్టిస్తోంది. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి చందు విహార యాత్రకు వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. యజమాని తిరిగి ఇంటికి విగత జీవిగా రావడంతో ఆ యజమాని ఫొటో ముందు శునకం అన్నపానీయాలు మాని దీనంగా నిల్చోవడం చూపరు లను కదిలిస్తోంది. ఏదో విధంగా ఆ రాకీకి ఎంతో కొంత ఆహారం తినిపించాలని ఆ కుటుంబ సభ్యులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఇదే కదా విశ్వాసం అంటే.

వసతి గృహాల తనిఖీ


భోజన వసతులు పరిశీలిస్తున్న జడ్జి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: విద్యార్థులకు భోజన వసతుల కల్పనలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని మండల లీగల్ సర్వీస్ ఛైర్మన్, అదనపు 11వ జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా సూచించారు. పట్టణంలోని బాలికల వసతి గృహం, బీసీ బాలుర వసతి గృహాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్స్ గదులు, విద్యార్థులకు అందించే సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పశ్చిమ జిల్లా ఫైర్‌మెన్ ఎన్నిక


సత్యనారాయణ, గణేశ్

భీమవరం క్రైం, ఆగస్టు 31 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవలు శాఖ రాష్ట్ర కమిటీ కోశాధికారిగా జిల్లాకు చెందిన ఫైర్‌మన్ పీవీ సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఫైర్‌మన్ ఎం.గణేష్ సప్తగిరి ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నెల్లూరు జిల్లాకు చెందిన కె.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా విశాఖపట్నం జిల్లాకు చెందిన పి.బాలకృష్ణ ఎన్నికయ్యారు.


పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) ద్వారకాతిరుమలలో కుళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీరు

కలుషిత నీరు... అపారిశుధ్యం

ద్వారకాతిరుమలలో మహిళల ఆందోళన

ద్వారకాతిరుమల, ఆగస్టు 31: కొద్దిరోజులుగా తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ తూర్పు వీధి మహిళలు శనివారం స్థానిక సచివాలయం వద్ద ఆందోళన చేశారు. అరకొరగా వస్తున్న నీరు మురుగుగా రావడంతో పాటు అందులో పురుగులు, ఇతర కీటకాలు కన్పిస్తున్నాయంటూ ఆవేదన చెందారు. కొన్నాళ్లుగా కుళాయిల ద్వారా ద్వారకాతిరుమలలో అధిక ప్రాంతాలకు కలుషిత తాగునీరు సరఫరా అవుతున్నది. దీనికి తోడు పలు వీధుల్లో తాండవిస్తున్న అపారిశుధ్య పరిస్థితులతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. తూర్పు వీధి, అర్చకుల వీధి, మెయిన్‌బజార్ పలు ఇతర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోంది. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు. కనీసం ట్యాంక్‌ను శుభ్రం కూడా చెయడం లేదు. పురాతన పైప్‌లైన్లు, లీకేజీల కారణంగా మురుగునీరు మంచినీటి పైపుల ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్నాయి. ట్యాంక్‌ను శుభ్రం చేయకపోవడంతో దానిపై నాచు పేరుకు పోయింది. పిచ్చిమొక్కలు మొలిచాయి.



నేలకొరిగిన భారీ వృక్షం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 31: పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో సుమారు వందేళ్ళ చరిత్ర కలిగిన భారీ వృక్షం శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా నేలకొరిగింది. చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రెండు విద్యుత్ స్థంభాలు పడిపోయాయి. వెంటనే ట్రిప్ అవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే అటుగా వెళ్తున్న కారుపై చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎస్సై జబీర్ చెట్టు పడిన ప్రదేశాన్ని సందర్శించారు. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే చెట్టు కొమ్మలను నరికించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆలయం వద్ద ఆందోళన



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: మాధవరం గ్రామ దేవతల ఆలయంలో పారదర్శకత లోపించిందని లెక్కలు అడిగితే రాజకీయ రంగు పులుముతున్నారని మాధవరం గ్రామస్థులు నిరసన తెలిపారు. ఆలయం వద్ద శనివారం గ్రామస్థులు సమావేశమయ్యారు. గతంలో ఈ ఆలయ కమిటీ పదేళ్లగా లెక్కలు చూపించకుండా నోటి లెక్కలతో ఆలయ నిర్వహణ చేస్తోందని, అదేమని ప్రశ్నిస్తే ఆలయంలో వైసీపీ నాయకులు రాజకీయ రంగు పులుముతున్నారన్నారు. ఈ విషయమై ఆదివారం గ్రామసభ నిర్వహించి ఆలయ కమిటీ బాధ్యతలు సమర్థులకు అప్పగిస్తామని గ్రామ పెద్దలు నిర్ణయించారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



ద్వారకాతిరుమల, ఆగస్టు 31: లక్ష్మీపురం ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఆలయంలో పవిత్రావరోహణ, శ్రీమహాపూర్ణాహుతి హోమాన్ని అర్చకులు, పండితులు ఘనంగా జరిపారు. ముందుగా స్వామి, అమ్మవార్లు, ఇతర దేవేరులపై ఉంచిన దివ్యపవిత్రాలను వేదమంత్రోచ్చరణలతో అర్చకులు తొలగించారు. ఆ తరువాత ఆలయంలో పూర్ణాహుతి హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఇందులో శ్రీవారి దేవస్థానం అర్చకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా ఎన్టీఆర్: మంత్రి నిమ్మల



పాలకొల్లు, ఆగస్టు 31 : భారత దేశానికే సంక్షేమాన్ని పరిచయం చేసిన మహానుభావుడు నందమూరి తారక రామారావు అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బ్రాడీపేట 2వ వీధి (బైపాస్‌రోడ్డు)లో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి నిమ్మల ప్రారంభించారు. విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే స్ఫూర్తి అని అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని అన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి నందమూరి తారక రామారావు అని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, జక్కంపూడి కుమార్, పొట్నూరి శ్రీనివాస్, దనాని ప్రకాష్, జీవీ సుబ్బారావు, రమేష్, బత్తుల మేరీ నిర్మల కుమారి పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహనకు మారథాన్ రన్

భీమవరం క్రైం, ఆగస్టు 31: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు అన్నారు. జిల్లాలో అవగాహన కార్యక్రమాలలో భాగంగా శనివారం నాడు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ప్రకాశం చౌక్ వరకు మారథాన్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో డా.బి భానూనాయక్, ఎయిడ్స్ ట్రీట్‌మెంట్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ మధుసూధనరావు మాట్లాడుతూ మారథాన్ రన్‌లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.7వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ మార్థాథాన్ రన్‌లో విజేతలు సెప్టెంబరు 3 న విజయవాడలో జరిగే స్టేట్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీఎంఅండ్‌హెచ్‌వో డా.ఉమామహేశ్వరరావు, మధుసూధనరావు, డీఐసీ హరనాథ్, ఏఆర్టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోవిందబాబు, డాక్టర్ వి.రాంబాబు, కౌన్సిలర్స్ ప్రభాకర్, పూర్ణేంద్ర, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

వర్షాలతో 20 రైళ్ల రద్దు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో విజయవాడ దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో నడుస్తున్న రైళ్ళల్లో 20 రైళ్ళను రద్దు చేస్తూ శనివారం రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల మీదుగా వెళ్ళే రైళ్ళు కూడా ఉన్నాయి.

రైల్ నెంబర్ 17257 విజయవాడ - కాకినాడ పోర్టు ఈనెల 31వ తేదీన రద్దు చేశారు. 07885 భీమవరం జంక్షన్ - నిడదవోలు ఈనెల 31తేదీన రద్దు చేశారు. 07886 నిడదవోలు - భీమవరం జంక్షన్ ఈనెల 31తేదీన రద్దు చేశారు. 07281 నర్సాపూర్ - గుంటూరు ఈనెల 31 తేదీన రద్దు చేశారు. 17269 విజయవాడ - నర్సాపూర్ ఈనెల 31, సెప్టెంబర్1,2వ తేదీన రద్దు చేశారు

మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం


ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఆగస్టు 31 : భారతీయ సంస్కృతిలో పండుగలు ప్రధాన భాగమని, వాటిలో అతి ప్రధానమైన పండుగ వినాయక చవితి అని, ఆది దేవుడైన వినాయకుడిని ముందుగా పూజ చేసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను వాడలనే ప్రచార భేరి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభించి బ్రోచర్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను వాడటం మంచిదని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల ద్వారా నిమజ్జనం చేసినప్పుడు కాలువల్లో చెరువుల్లో కాలుష్యంతో దెబ్బతింటున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పిలుపునిచ్చారు. ప్రచార భేరి కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, గోపిశెట్టి మురళీ, జడ్డు ప్రసాద్ పాల్గొన్నారు.

భీమవరం క్రైం: పర్యావరణ హితమైన వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నాడు జిల్లా ఎస్పీ అస్మి చేతుల మీదుగా ఏకో ఫ్రెండ్లీ గణేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ వంటి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో స్పేస్ ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, సభ్యులు రామాయణం సతీష్, జడ్డు ప్రసాద్, వీరవల్లి మధు, జడ్డు సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.


పర్యావరణహిత పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అస్మీ

మితిమీరిన స్వేచ్ఛ వల్లే చెడు ప్రభావాలు


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జమాతే ఇస్లామి హింద్ సభ్యులు

భీమవరం అర్బన్, ఆగస్టు 31 : నేడు సమాజంలో మితిమీరిన స్వేచ్ఛ వల్ల మహిళలపై చెడు ప్రభావం చూపుతోంది..నిజమైన స్వేచ్ఛ అనేది కేవలం నైతికతతోనే సాధ్యమని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుమారి ఫర్హానా అన్నారు. నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదాంతో సెప్టెంబర్ నెలలో అవగాహన ఉద్యమ ప్రారంభానికి సంబంధించిన బ్రోచర్లను శనివారం భీమవరంలోని శాఖ కార్యాలయంలో ప్రారంభించారు. జాతీయస్థాయి అవగాహన ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎన్‌సీఆర్‌బి 2022 రిపోర్ట్ ప్రకారం భారతదేశంలో ప్రతి రోజు 90అత్యాచార కేసులు నమోదవుతున్నాయని, యువత మద్యపానం, డ్రగ్స్ వంటి దురవ్యసనాల బారిన పడుతునారన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ దేశంలో 75సంవత్సరాలుగా సమాజ సంస్కరణకై కృషి చేస్తుందన్నారు.


శ్రీవారి కల్యాణ గానామృతం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు.. (ఇన్‌సెట్‌లో) గ్రామంలో ప్రదర్శనగా వస్తున్న భక్తులు

శ్రీవారి కల్యాణ గానామృతం

పెనుగొండ, ఆగస్టు 31: సిద్ధాంతం గ్రామంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి పద్మావతి కల్యాణ కథ గానామృతం కార్యక్రమం వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నందమూరి గ్రామానికి చెందిన సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీనివాస పద్మావతి కల్యాణ గానామృతం నేత్రపర్వంగా నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు యక్కల త్రిమూర్తులు, భద్రావతి దంపతచే ఈ కల్యాణ కార్యక్రమం ఎంతో భక్తిపారవస్యంతో నిర్వహించారు. స్వామి వార్ల పెళ్ళి చూపులు, కల్యాణానికి విడిది, కల్యాణం, తరువాత సారే పెట్టి అమ్మవారిని పంపించడం తదితర పెండ్లి తంతు అంతా కళ్ళకు కట్టినట్లుగా గానామృతం ద్వారా వారు ప్రదర్శించడంతో భక్తులు పరవశంతో మునిగిపోయారు. కల్యాణం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి గురువు యల్లపాటి ఆనందరావు నేతృత్వం వహించారు.

క్రైం కార్నర్

ఎంపీటీసీ ఇంటిపై రాయితో దాడి


పగిలిన కిటికీ అద్దం

యలమంచిలి, ఆగస్టు 31: యలమంచిలి గ్రామంలో టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మి శ్రీనివాస్ ఇంటిపై శుక్రవారం అర్ధరాత్రి అగంతకులు రాయి విసరడంతో ఇంటి కిటికీ అద్దం పగిలిపోయింది. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ దుశ్చర్యకు పాల్పడిన అగంతకులను అధికారులు గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. ప్రజాప్రతినిధి ఇంటిపై అర్ధరాత్రి దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ నాయకులు బొప్పన హరికిషోర్, తాడి శశిధర్ తదితర నాయకులు పేర్కొన్నారు.

ఏటీఎం కార్డు చోరీ - కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : ఏటీఎం సెంటర్‌లో సొమ్ములను డ్రా చేసుకోవడానికి వెళ్ళిన వృద్ధురాలిని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసగించి కార్డును అపహరించి 20 వేల రూపాయలు డ్రా చేసుకున్నాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ సంఘటనకు సంబంధించి మేరుగు కాంతమ్మ (60) వట్లూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పక్కనే ఉన్న ఏటీఎంనకు డబ్బులు డ్రా చేసుకోవడానికి వెళ్ళింది. అక్కడే గుర్తు తెలియని యువకుడు ఉండడంతో సొమ్ములు డ్రా చేసి ఇమ్మని కోరింది. అతను డ్రా చేసి ఇచ్చి ఆ కార్డును మార్చేశాడు. ఆ తరువాత కార్డులోని 20 వేల రూపాయలను అపహరించాడు. ఈ సంఘటనపై బాధితురాలు ఏలూరు త్రి టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : పని మనిషికి ఇంటిని అప్పగించి పని అయిన తరువాత తాళం వేసి వాచ్‌మెన్‌కు ఇచ్చి వెళ్ళాలని చెప్పి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం నేతాజీనగర్‌లో ఒక అపార్టుమెంటులో నివాసం ఉంటున్న చిన్నం విజయ్‌కుమార్ ఈనెల 28వ తేదీ ఉదయం తన భార్యతో కలిసి ఆశ్రం ఆసుపత్రికి బయలుదేరుతుండగా అంతలో వారి ఇంట్లో పనిచేసే మహిళ వచ్చింది. ఇంట్లో పని అయిన తరువాత ఇంటికి తాళం వేసి కింద ఉన్న వాచ్‌మెన్‌కు ఇచ్చి వెళ్ళాలని చెప్పారు. పనిచేసే మహిళ వారు చెప్పిన విధంగానే పని అయిన తరువాత తాళం వేసి తాళం చెవిని వాచ్‌మెన్‌కు ఇచ్చి వెళ్ళిపోయింది. ఆసుపత్రి నుంచి వచ్చి తాళం తీసి చూడగా తమ ఇంట్లోని మూడున్నర కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో శనివారం రాత్రి వారి ఇంట్లో పని చేసే మహిళ కుమారి పై అనుమానం వ్యక్తం చేస్తూ విజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ సీజ్

జీలుగుమిల్లి, ఆగస్టు 31: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఎస్ఐ పి.వినయ్‌కుమార్ సీజ్ చేశారు. దర్భగూడెం సమీప కాలువల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టరును సీజ్ చేశారు. బన్నె నాగార్జున, కుంజా వెంకటేశుపై కేసు నమోదు చేశారు.

జంగారెడ్డిగూడెం: తిరుమలాపురం గ్రామ శివారులో ఉన్న బైనేరు వాగులోని ఇసుకను అక్రమంగా ట్రాక్టరులో తరలిస్తున్న దొడ్డి వెంకట శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి ట్రాక్టరును అదుపులోకి తీసుకున్నట్లు హెచ్‌సి.భాస్కరరావు తెలిపారు.

డెంగీతో ఉలిక్కిపడ్డ అత్తిలి

ఆస్పత్రుల చుట్టూ జ్వరపీడితులు


అత్తిలిలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వేచి ఉన్న రోగులు

అత్తిలి, ఆగస్టు 31: అత్తిలి గ్రామానికి చెందిన ఆరేళ్ళ చిన్నారి డెంగీతో మృతి చెందిన విషయం తెలియడంతో అత్తిలి ప్రజలు ఉలిక్కిపడ్డారు. జ్వరాల విజృంభణతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పలువురు ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తూ చికిత్స పొందుతున్నారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికి అధికశాతం ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో వైరల్ ఫీవర్స్ ఇంటికొకటి ఉన్నప్పటికి వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాతావరణ మార్పులతో జ్వరాల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నది. డెంగీతోపాటు టైఫాయిడ్, విష జ్వరాలు ఎక్కువగా ఉంటున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం కేసులు పెరిగాయని చెబుతున్నారు.

7 నుంచి 10 రోజుల పాటు జ్వరాలు

గతంలో వైరల్ జ్వరాలువస్తే మందులు వేసుకున్నా లేకున్నా మూడు నుంచి నాలుగు రోజుల్లో తగ్గిపోయేవి. ప్రస్తుతం కనీసం 7 నుంచి 10 రోజుల ఉంటుంది. ప్లేట్‌లెట్స్ వేగంగా పడిపోతున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయరాదని వెంటనే చికిత్స చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఒక్కొక్కరికి రూ.4 వేలు ఖర్చు...

డెంగీ, మలేరియా వంటి లక్షణాలతో రోగులు చికిత్సకు వెళుతుంటే వీరికి రక్త పరీక్షతోపాటు ఇతర వైద్య పరీక్షలకు మొత్తంగా రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందని బాధితులు చెబుతున్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా వందల సంఖ్యలో జ్వర పీడితులు కనిపిస్తున్నా వైద్యులు లెక్కలు మాత్రం నామ మాత్రంగా చూపిస్తున్నారు. అధికారులు వాస్తవాలను బయట పెట్టకుండా తక్కువ సంఖ్య చూపిస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటం, నీరు కలుషితం అవుతుండటం తదితర కారణాలతో ఎక్కువ మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లో ఎక్కువ మంది ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మృతురాలి ఇంటి పరిసరాల పరిశీలన


చదువుతున్న స్కూల్‌లో దోమల లార్వాను పరిశీలిస్తున్న హెల్త్ సిబ్బంది

అత్తిలి, ఆగస్టు 31: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు అన్నారు. డెంగీ జ్వరంతో గూనా నిత్య శ్రీ పద్మ అనే బాలిక మృతి చెందిన సంఘటనపై శనివారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి బాధిత కుటుంబ సభ్యులను కలుసుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ డెంగీ జ్వరంతో బాలిక మృతి చెందినదనడానికి ఎటువంటి నిర్ధారణ పరీక్షలు వారి వద్ద లేవని బాలిక తల్లి దండ్రులు చెప్పారన్నారు. ఇంటి పరిసరాలను పరిశీలించి వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థిని చదివిన ఎంఎం స్కూల్‌ను సందర్శించి పరిసరాల శుభ్రత, విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రతపై స్కూల్ యాజమాన్యంతో చర్చించారు. దోమల లార్వాను సేకరించి పరీక్షించారు. గ్రామంలో ఫీవర్ సర్వే జరుగుతోందని చెప్పారు. జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వారు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య పరీక్షలు జరిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవో పి శ్రీనివాసరావు, సబ్‌యూనిట్ అధికారి జి వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఏవో పి మురళీ, సిహెచ్ వెంకట్రావు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో అమ్మపేరుతో మొక్క


విశ్వవిద్యాలయం ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 31: అమ్మపేరు మీద ఒక మొక్క అనే కార్యక్రమంలో భాగంగా వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రాంగణంలో ఈస్ట్‌కోస్ట్ టాల్ రకం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ ఎల్.నారంనాయుడు పాల్గొన్నారు.

సీఎం సీరియస్

(మూడో పేజీ తరువాయి)

ఫుడ్ టెక్నాలజీలో అర్హత ఉన్న వారిని అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించాలని అధికారులకు సూచించాం. ఫ్యాకల్టీ, సెక్యూరిటీ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించే సమయంలో వారికి ఎలాంటి నేరచరిత్ర లేని వారిని మాత్రమే తీసుకోవాలి. దీనికి పోలీసుల సహకారం పొందాలి. విద్యార్థుల సౌకర్యాల విషయంలో స్పష్టమైన మార్పులు రావాలి. నాణ్యమైన ఆహారం, చదువుకోవడానికి చక్కని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం' అని మంత్రి తెలిపారు.

మళ్లీ అదే ఆహారం.. విద్యార్థుల అసంతృప్తి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మంత్రి, జిల్లా అధికారులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు పలుమార్లు హెచ్చరించినా మెస్ నిర్వాహకులు తీరు మారలేదు. శనివారం కూడా అదే నాణ్యత లేని ఆహా రాన్ని అందించారని విద్యార్థులు వాపోయారు. ఆహారం రుచి చూసిన మంత్రి పార్థసారథి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా మెస్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడానికి కారణంపై విద్యార్థుల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. మెస్‌ల్లో తమకు అందుతున్న ఆహారాన్ని రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి పెట్టకుండా మెస్ నిర్వాహకులను బుజ్జగించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. శనివారం ట్రిపుల్ ఐటీలో జ్వరాల బారిన పడి మరో 59 మంది విద్యార్థులు అవుట్ పేషెంట్‌గా చికిత్స పొందారు. ఇప్పటికే వందలాది మంది జ్వరాల బారినపడి కోలుకున్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్లు ఫుడ్ కోర్టుకే..!

ట్రిపుల్ ఐటీ నూజివీడు మున్సిపాలిటీకి ఏటా లక్షలాది రూపాయలు ట్యాక్స్ రూపేణా చెల్లిస్తోంది. పది వేల మంది ఉండే క్యాంపస్‌లో చెత్తా చెదారం తీసుకెళ్ల డానికి పురపాలక సంఘం ట్రాక్టర్లు రావు. కాని, ఇదే క్యాంపస్‌లో ఫుడ్ కోర్టుకు మాత్రం చెత్తను తీసుకెళ్లడానికి ట్రాక్టర్లు వస్తాయి. ఈ ఫుడ్ కోర్టు నడిపేది పురపాలక సంఘం నాయకులు కావడమేనా ? అని విద్యార్థుల ప్రశ్న. మెస్‌లలో అపరిశుభ్రంగా ఉండటమే కాక చెత్తా చెదారం నిండివున్న కుండీలు, డస్ట్ బిన్‌లను స్వయంగా చూసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా వాటిని వెంటనే క్లీనింగ్ చేయించి ఉంటే బాగుండేదని విద్యార్థులు అంటున్నారు.

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరఫరా

ఏలూరు సిటీ, ఆగస్టు 31: నిత్యావసర సరుకులను జిల్లాలోని 6,31,044 కార్డుదారులకు ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి 395 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో ఎనిమిది ఎంఎస్ఎస్ పాయింట్లు నుంచి ఇప్పటికే అన్ని చౌక డిపోలకు నిత్యావసర సరుకులు లిఫ్టింగ్ చేశామన్నారు. బియ్యంతో పాటు పంచదార కూడా పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందిగా జేసీ ఆదేశించారు.

ఎర్రకాలువ జలాశయంలోకి స్వల్పంగా వరద నీరు

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 31 : మండలంలోని శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయానికి స్వల్పంగా వరద నీరు చేరింది. శనివారం కురిసిన భారీ వర్షానికి గంటకు మూడు వేల క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరుతుండగా దిగువ ప్రాంతాలకు జలాశయం గేట్ల ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ రాంబాబు తెలిపారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.75 మీటర్లుగా ఉంది. ఇదిలా ఉండగా జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు శనివారం జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దార్ కె.స్లీవజోజి ఎర్రకాలువ జలాశయాన్ని పరిశీలించారు.జలాశయం లోకి వచ్చే వరద ఉధృతిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నియామక పత్రాలు అందజేత

ఏలూరు రూరల్, ఆగస్టు 31: స్థానిక బీజేపీ ఏలూరు జిల్లా కార్యాలయంలో చింతలపూడి అసెంబ్లీ నాయకులతో, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా బీజేపీ నాయకులకు నియామక పత్రాలు అందజేశారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, ఎస్.దానభాస్కర్‌రావు, చింతలపూడి కన్వీనర్ ఒ.ఏసువరప్రసాద్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హిందూపురం ఎంపీ



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న ఎంపీ పార్థసారథి

ద్వారకాతిరుమల, ఆగస్టు 31: చినవెంకన్న ఆలయాన్ని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి శనివారం సందర్శించారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు పి.భాను అయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదా శీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పాఠశాలలో మద్యం సీసాల కలకలం

పోలవరం, ఆగస్టు 31 : గూటాలలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని మద్యం సీసాలు శనివారం గ్రామంలో కలకలం రేపాయి. గుడి కంటే బడిమిన్న అని చదువుకునే పవిత్రమైన విద్యాలయ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి మద్యం తాగి మద్యం సీసాలు పగులగొట్టి గాజు పెంకులు వాటర్ ప్యాకెట్లు, సిగరెట్ పీకలు తరగతి గదుల వద్ద వేసి వెళ్ళారు. ఉదయం పాఠశాల శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్ గ్రామస్థులకు తెలియజేయడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాలలకు భద్రత కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరామర్శ



భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాంబాబు

కొయ్యలగూడెం, ఆగస్టు 31: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జమ్ముల ఉదయభాస్కర్ కన్నాయిగూడెంలోని ఆయన కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు శనివారం పరామర్శించారు. సోదరుడు హరికృష్ణ, కుమారుడ్ని ఓదార్చారు. అనంతరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు ఉన్నారు.

సెల్ టవర్ నిర్మాణం వద్దని నిరసన

నిడమర్రు ఆగస్టు 31 : తమ గ్రామంలో ఇళ్ల మధ్య సెల్‌ఫోన్ టవర్ నిర్మాణం చేయవద్దంటూ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మందలపర్రు గ్రామంలో నివాస ప్రాంతాల మధ్య ఒక సెల్ కంపెనీకి చెందిన టవర్ నిర్మాణం నిమిత్తం 10 అడుగుల గొయ్యి తవ్వు తుండగా ఆ నిర్మాణం ఆపాలంటూ గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్ టవర్ వల్ల వచ్చే రేడియేషన్ ప్రభావంతో పర్యావరణం దెబ్బతినడంతో పాటు, పక్షుల ఆవాసం పోతుందని, నివాసాల ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలంటూ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు.

రేపటికి టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్ వాయిదా

ఏలూరు అర్బన్, ఆగస్టు 31 : వర్షాల కారణంగా ఏలూరు డివిజన్ స్థాయి సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్‌ను సోమవారానికి వాయిదా వేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా ఇంగ్లీషు, హిస్టరీ సబ్జెక్టుల అధ్యాపకులుగా పనిచేస్తున్న డీడీ రజని, ఎం.ఎస్తేర్ కళ్యాణి ఉద్యోగ విరమణ చేయడంతో మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ వారిని సత్కరించారు.
- **ఉంగుటూరు :** కైకరం హై స్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సత్తిరాజు శ్రీరాం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయనను జెడ్పీటీసీ, విద్యా కమిటీ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు ఘనంగా సత్కరించారు.
- చేబ్రోలు బాలికల వసతి గృహంలో శనివారం తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.
- ఉంగుటూరు మండల వ్యవసాయాధికారిగా ఎస్ఎస్ ప్రవీణ్ కుమార్ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.
- **దెందులూరు :** మండల ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీలత, వైద్య సిబ్బంది కొవ్వలి గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 40 మంది వరకూ జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు.







భారీ వర్షానికి నీట మునిగిన ఏలూరు ఆర్టీసీ బస్టాండ్, పత్తేబాద్ రైతు బజార్, వర్థినేడి కృష్ణ మూర్తి వీధి



జంగారెడ్డిగూడెంలోని ఏలూరు రోడ్డులో వర్షం నీరు

జోరుగా వాన

» అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం » పొంగిపొర్లుతున్న వాగులు » పెదపాడు మండలం గోగుంటలో నీట మునిగిన ఎస్సీ కాలనీ


బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో నియోజవర్గంలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం సాయంత్రం వరకు జోరు వర్షం కురుస్తూనే ఉంది. రహదారులన్ని జలమయమయ్యాయి. విరామం లేకుండా వర్షం కురుస్తుండడంతో రహదారుల గుంతలు మరింత పెద్దవయ్యాయి. డ్రైన్‌లు పొంగిపొర్లాయి. రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. కలెక్టర్ వెట్రిసెల్వీ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు.



పెదపాడు మండలం గోగుంటలో ఎస్సీ కాలనీలోకి చేరిన వర్షపు నీరు

ఏలూరు టూ టౌన్/ ఏలూరు రూరల్/బుట్టాయగూడెం/పోలవరం/ లింగపాలెం/కుక్కునూరు/ కొయ్యలగూడెం /ఉంగుటూరు /పెదవేగి/ చింతలపూడి /భీమడోలు/జీలుగుమిల్లి/జంగారెడ్డిగూడెం/ద్వారకాతిరుమల, ఆగస్టు 31: వర్షాలకు ఏలూరు నగరంలోని రోడ్లన్ని జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో డ్రైన్లలోని మురుగు, వర్షపు నీరు కలిసి రోడ్డు పైకి రావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన వర్షం రాత్రంతా కురుస్తూనే ఉంది. నగరంలోని ఆర్ఆర్ పేట, ఎన్ఆర్ పేట, పవర్‌పేట, అశోక్‌నగర్, వన్‌టౌన్‌లలో అనేక కాలనీలు జలమయమయ్యాయి. ఆర్ఆర్‌పేట లోబ్రిడ్జిలో నీరు చేరడంతో ముందు జాగ్రత్త చర్యగా గేట్లను మూసివేశారు. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతులు, ప్రజలు కలవరానికి గురవుతున్నారు. ఇక ఏజెన్సీ ప్రాంత వాసులకు విరామం లేకుండా కురుస్తున్న ముసురు విసుగు పుట్టిస్తుంది. ప్రజలు నిత్యావసరాలను తెచ్చుకోడానికి, ఇతర పనులు చేసుకోడానికి వీలులేకుండా పోయింది. కూలీ పనులు చేసుకుని పూట గడుపుకునే పేదలు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం వరకు వాగులు సాధారణ స్థాయిలోనే ప్రవహిస్తున్నాయి. గొర్రెలు, మేకలు, పశువుల కాపరులు, యజమానులు నానా అవస్థలు పడుతున్నారు. పోలవరంలో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడంతో ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులను వెనక్కి పంపారు. పోలవరంలో 16.04 మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. లింగపాలెంలోని ప్రధాన రహదార్లపై వర్షం నీరు ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపాడు బస్టాండ్ ఎదురుగా ఉన్న పెదపాడు-వట్లూరు రహదారిలో ఉన్న రెండు కాజువేలపై నుంచి పెద్దఎత్తున వరద నీరు ప్రవహిస్తుండడంతో ఆ రహదారిలోని రాకపోకలను రెవెన్యూ అధికారులు నిలిపివేసి సిబ్బందిని కాపలా ఉంచారు. పెదపాడు ప్రధాన రహదారి కొత్తూరు శివారు ప్రాంతంలో భారీ వృక్షం నేలకూలడంతో ఏలూరు, పెదపాడు వైపు కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసులు రహదారికి అడ్డుగా ఉన్న చెట్టును ప్రొక్లెయిన్‌తో తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. టీడీపీ నాయకులు కొత్తూరు చినబాబు స్థానిక యువకులతో కలిసి సహకారం అందించారు. నాయుడుగూడెం, సత్యవోలు, కొణికి, ముప్పర్రు పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. గోగుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలోకి నీరు రావడంతో 150 ఇళ్లు నీటమునిగాయి. గ్రామంలోకి నీరు రావడంతో ఇన్‌చార్జి తహసీల్దారు ఎన్‌వీడీ ప్రసాద్ ఆ ప్రాంతాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టి, పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తుల కోసం రిలీఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. కుక్కునూరు మండలంలోని ప్రధాన వాగులైన గుండేటివాగు, వెంకటాపురం వాగు, పాలవాగులు వర్షపునీటితో పోటెత్తి ప్రవహిస్తున్నాయి. కుక్కునూరు, భద్రాచలం, కుక్కునూరు, అస్వారావుపేట ప్రధాన రహదారులు గోతుల మయంగా మారాయి. వర్షానికి పత్తిచేలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వెళ్ళే రహదారి పొంగుటూరు నుంచి యర్నగూడెం వెళ్ళే రహదారులు పూర్తి బురదమయమై వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పంట కాల్వలు పొంగి పొర్లాయి. కన్నాపురం పడమటి కాల్వ, తూర్పు కాల్వ పొంగిపొర్లాయి. ఉంగుటూరు మండలంలో శనివారం ఉదయానికి 40.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. పెదవేగి తహసీల్దార్ డి.భ్రమరాంబ ఆయా గ్రామాల్లో పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. పెదవేగి మండలంలో 78.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కూరగాయల పాదులకు నష్టం ఉంటుందని ఏవో ప్రియాంక చెప్పారు. విజయరాయిలో రహదారిపైనుంచి నీరు పారుతూ ప్రమాదకరంగా మారడంతో ఎక్స్‌కవేటర్‌తో నీటిని పోయే మార్గం ఏర్పాటు చేసి, వాహనచోదకులు ఇబ్బందులను తొలగించారు. చింతలపూడి మండలంలో సుమారు 36 పెద్ద చెరువులు, 120 ఎంఐ చెరువులు ఉన్నాయి. ఇక తమ్మిలేరు రిజర్వాయర్ తమ్మిలేరు పరివాహక ప్రాంతాల్లో కూడా వర్షం పడింది. రిజర్వాయర్‌లోకి సాయంత్రం 500 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరింది. ఇది కేవలం క్యాచ్‌మెంట్ ఏరియాలో పడిన వర్షం మాత్రమే. ఎగువ తెలంగాణలో వర్షాలు కురవడంతో తమ్మిలేరుకు వరదనీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. భీమడోలు జంక్షన్, పంచాయతీ కార్యాలయం సమీపంలో వరద నీరు చేరింది. జీలుగుమిల్లి మండలంలో పొగాకు నారుమడులు పెంచె రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పది రోజులుగా మండలంలో పొగాకు నారు పెంచెందుకు రైతులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అవి మొలకెత్తాయి, మరికొన్ని చొట్ల మొలకెత్తే దశలో ఉన్నాయి. దీంతో వర్షం కారణంగా అవి దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వర్షంలోనే వాటికి పురుగు మందులు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. వేరుశనగ పంట వేసిన రైతులది ఇదే పరిస్థితి. జీలుగుమిల్లి, పి.రాజవరం, ములగలంపల్లి, బర్రింకలపాడు ప్రాంతాల్లో మరికొందరు రైతులు షెడ్ నెట్‌లో పొగాకు నారు పెంచుతున్నారు. జంగారెడ్డిగూడెంలోని ఊర చెరువు ప్రాంతంలో డ్రైనేజీ కల్వర్టు రోడ్డుకంటే బాగా ఎత్తుగా నిర్మించడంతో మోకాలు లోతులో రోడ్డంతా మునిగిపోయింది. దీంతో దిగువన ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ద్వారకాతిరుమల మండలంలో పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. కాలువలను తలపించాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీటితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షం.. ఎండుతున్న పైర్లకు జీవం



మాదేపల్లిలో నీరులేక బీడువారిన వరి పంట

ఏలూరు రూరల్, ఆగస్టు 31: మండలంలోని మాదేపల్లి, లింగారావుగూడెం, కాట్లంపూడి, తదితర గ్రామాల్లోని వందలాది ఎకరాలకు సాగునీరు అందలేదు. కృష్ణా-గోదావరి నదుల్లో సమృద్ధిగా నీరు ఉన్నా పంట భూములకు అందించలేని దుస్థితి ఏర్పడింది. ఓల్డ్ జాలిపూడి కాలువ ఆయకట్టు పరిధిలో పంట భూములకు సాగునీరు అందకపోయినా జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోలేదు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టి అన్నదాతలు సాగుచేస్తే నేడు దిక్కుతోచని స్థితిలో అల్లాడారు. ఇంకా నాట్లు వేయాల్సి ఉన్నా నీరులేక నాట్లు వేయలేని పరిస్థితి ఏర్పడింది. భూములు ఎండిపోయే స్థితిలో ఉన్న తరుణంలో ఎడతెరిపిలేని వాన, రైతుల్లో ఆనందాన్ని నింపింది. అల్పపీడన ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆయా పైర్లకు జీవం పోశాయి. మరో రెండురోజుల పాటు ఒక మోస్తారు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పెదవేగిలో అరటితోటను ముంచిన వర్షపు నీరు



లింగపాలెంలో రోడ్లపై పారుతున్న నీరు



కుక్కునూరులో ఛిద్రమైన ప్రధాన రహదారి



ద్వారకాతిరుమలలో రోడ్ల పైన వర్షపు నీరు



జీలుగుమిల్లిలో పొగాకు నారుమడులలో నీరు

తమ్మిలేరు లాకులను పరిశీలించిన ఎస్పీ



ఏలూరు క్రైం, ఆగస్టు 31 : భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో తమ్మిలేరు ప్రవహిస్తున్న నీటి ప్రవాహ మార్గాలను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ అధికారు లతో కలిసి శనివారం పరిశీలించారు. ఏలూరులోని అమీనాపేట లోబ్రిడ్జి, తూర్పు, పడమర లాకులు, వైఎస్ఆర్ కాలనీ ప్రాంతాల్లో పరిశీలన చేశారు. ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ప్రవాహాన్ని ముందుగా అంచనా వేస్తూ ఎక్కడా ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఏలూరు-శనివారపుపేట కాజ్‌వేపై శనివారం రాత్రి 10 గంటలకు నీరు పైకి ఎక్కింది.

ముందస్తుగా బందోబస్తు

జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో తమ్మిలేరు రెండు పాయల నిడివిలోని అన్ని ప్రాంతాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. శనివారపుపేటలో బ్రిడ్జి, సీఆర్ఆర్ కాలేజీ బ్రిడ్జి, తూర్పు, పడమర లాకులు, తంగెళ్ళమూడి బ్రిడ్జి ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా శ్రావణలక్ష్మి సరదాల సంతోషం



శకుంతల వేషధారణలో మహిళలు

ఏలూరు రూరల్, ఆగస్టు 31: అర్బన్ జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు టి.అరుణ వెంకటకుమారి ఆధ్వర్యంలో శ్రావణలక్ష్మీల సరదాల సంతోషం పేరు తో శనివారం స్థానిక టుబ్యాకో మర్చంట్స్ ఛాంబర్ కల్యాణ మండపంలో వేడుకలు నిర్వహించారు. మహిళలకు గోల్డ్ హౌసీ, సిల్వర్ హౌసి, హోమ్ అప్లైయిన్స్ హౌసీ, పట్టు చీరల హౌసీ వంటి వినూత్న కార్యక్రమాలతో వేడుకలు నిర్వహించారు. అనంతరం శకుంతల వేషధారణలతో వినూత్న పోటీలు నిర్వహించారు. 20 మందికి పైగా మహిళలు శకుంతల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరై, ఆయా పోటీల్లో గెలుపొందిన విజేతల కు బహుమతులు అందజేశారు. శ్రావణ మాసంలో మహిళలకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం వల్ల ఎప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలకు సంతోషాన్ని ఇస్తాయని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యదర్శి మడుపల్లి వర్మా, పద్మనాభుని స్వప్న, తవ్వా రామ్‌ప్రసాద్, మద్దుల పవన్ పర్యవేక్షించారు.

పింఛన్ల పంపిణీలో రికార్డు సృష్టించాం







లింగపాలెం, దెందులూరు మండలం గోపన్నపాలెం, ఉంగుటూరు మండలం నీలాద్రిపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు రోషన్‌కుమార్, చింతమనేని, ధర్మరాజు



కురేళ్ళగూడెంలో గన్ని పింఛను పంపిణీ

» ఎమ్మెల్యేలు సొంగా, చింతమనేని, బడేటి, పత్సమట్ల

» జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 31: జోరు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నాయకులు, అధికారులు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. 50వ డివిజన్ ఎంఆర్‌సీ కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మేయర్ నూర్జహాన్ కలెక్టర్ కె.వెంట్రిసెల్వి పింఛన్ల పంపిణీ చేశారు. 50వ డివిజన్ ఎంఆర్‌సీ కాలనీలో ఎమ్మెల్యే చంటి, మేయర్ నూర్జహాన్, కలెక్టర్ వెంట్రిసెల్వి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ సూర్యోదయానికి ముందుగానే ఉద్యోగులు ఇంటింటికి వెళ్ళి పింఛన్లు పంపిణీ చేశారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో 28,751 మందికి రూ.12.51 కోట్లు పింఛన్లు అందజేశామన్నారు. డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విజయరాజు, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ శేషగిరి, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, చోడే వెంకటరత్నం, మహాలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు. 29వ డివిజన్‌కు చెందిన కాకర్ల రమాదేవి అనే మహిళ క్యాన్సర్ వ్యాధి కారణంగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటుంది. ఆమెకు డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి వేగి ప్రసాద్ పింఛన్ అందించారు.

- ఉంగుటూరు : కూటమి ప్రభుత్వం పేదలకు ఫించన్ల పంపిణీ విషయంలో చిత్తశుద్ధితో ఉందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎమ్మెల్యే మండలంలోని నీలాద్రిపురంలో ఇంటింటికీ తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. కూటమి నాయకులు పి.హరిబాబు, టి.రమేష్, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- లింగపాలెం : సంక్షేమ పథకాలతో పేదల కళ్ళల్లో సంతోషాన్ని నింపేలా సీఎం చంద్రబాబు చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. సింగగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లిఖార్జున్‌రావు, బొంతు రాంబాబు, బొంతు శ్రీను, తాతిన రాధాకృష్ణ, అసిలేటి అజయ్, అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.
- దెందులూరు : ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసి రికార్డు సృష్టించామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గోపన్నపాలెంలో మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చింతా సుబ్బా రావు, టీడీపీ నేతలతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని శనివారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గోపన్నపాలెం ప్రభుత్వాస్పత్రిని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. జర్వాలతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. విష జ్వరాల బారిన పడుతున్న ప్రాంతంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యశాఖాధికారి, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీలతతో కలిసి చింత మనేని పరిశీలించారు. వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. టీడీపీ నేతలు కసుకుర్తి రామకృష్ణ, బోడేటి మోహన్ బాబు తదితరులున్నారు. అలాగే ఆశ్రం ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న పోతునూరు గ్రామానికి చెందిన పింఛనుదారునికి ఉదయం ఆరు గంటలకే ఆస్పత్రికి వెళ్లి సచివాయ ఉద్యోగి రూ.10 వేల పింఛను అందజేశారు.
- బుట్టాయగూడెం : కేఆర్ పురంలో మాజీ సర్పంచ్ కోర్స వెంకటేశ్వరావు, కొవ్వాసి గంగాధర్, కోర్స ఆనంద్, బుట్టాయగూడెంలో మందపాటి మోజేష్, మాటూరి ముసలయ్య, వరక కృష్ణంరాజు, కండ్రిక గూడెం, అచ్చియ్యపాలెంలో అబ్బూరి సుబ్బారావు, కొండపల్లి కృష్ణారావు, దెయ్యాల కృష్ణమోహన్ పింఛన్లు పంపిణీ చేశారు.
- వేలేరుపాడు : మండలంలోని 3,230 లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే 70 శాతం పింఛన్లను పంపిణీని చేసినట్లు ఎంపీడీఓ మూర్తి తెలిపారు. కూటమి శ్రేణులు పాల్గొన్నారు.
- కుక్కునూరు : మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన మండల అధ్యక్షు డు ఎం.యుగంధర్, బీజేపీ కోశాధికారి లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు పాల్గొన్నారు.
- నిడమర్రు : మండలంలో 17 పంచాయతీల పరిధిలో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయి నట్లు ఎంపీడీవో జి.విజయకుమారి తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.
- భీమడోల : మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 96 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. కురేళ్ళగూడెంలో ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే గ్రామ గ్రామన అధికారులు వివిధ శాఖల సిబ్బందితోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ భరోసా ఫించనును ఇంటింటికి తిరిగి వర్షంలో కూడా పంపిణీ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం : వేగవరంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు పారేపల్లి రామారావు, సర్పంచ్ నాగరాజు, కూటమి నాయకులు కుక్కల మాధవరావు, ఆలపాటి దుర్గా రాం ప్రసాద్, అనిశెట్టి శ్రీనివాసరావు, కుక్కల సూరిబాబు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి తూటిగుంట రాము, సత్యకృష్ణ, మానికల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- కామవరపుకోట : మండలంలో 91.71 శాతం పెన్షన్ల పంపిణీ చేశామని ఎంపీడీవో కె.శ్రీదేవి తెలిపారు.


ప్రధాన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న రాములేరువాగు


వరద ఉధృతికి విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి


నూజివీడు బంగినపల్లి తోటలో..


ముదినేపల్లిలో జలదిగ్బంధంలో ఆర్సీఎం చర్చి


చెక్కపల్లి అంబేద్కర్ కాలనీ ఇళ్ళలోకి వెళుతున్న వరద నీరు

జల దిగ్బంధం

» భారీ వర్షాలకు పొంగిన వాగులు, వంకలు.. » చెరువులకు గండ్లు » చెరువులను తలపించిన రహదారులు

» సహాయక చర్యలు పర్యవేక్షించిన మంత్రి పార్థసారథి, ఎస్పీ శివకిషోర్

నూజివీడు/నూజివీడు టౌన్, ఆగస్టు 31: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు నూజివీడు జలదిగ్బంధంలో చిక్కుకుంది. నూజివీడు పెద్దచెరువుకు గండిపడటంతో వరదనీరు నూజివీడును చుట్టుముట్టింది. నూజివీడు మడుపల్లి తాతయ్య జూనియర్ కళాశాలలో గల బాలికల హాస్టల్‌లోకి నీరు చేరడంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన కళాశాలకు చేరుకుని సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్ళారు. దీంతో హాస్టల్లో ఉన్న 157 మంది విద్యార్థులను తొలుత నూజివీడులో గల కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాలకు తరలించి అక్కడి నుండి బాలికల సమీకృత వసతి గృహానికి తరలించారు. ఇక నూజివీడు పెద్దచెరువు గండిపడిన ప్రాంతం నుంచి భారీగా వరదనీరు రావడంతో ఏలూరు జిల్లా ఎస్పీ శివ కిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్వయంగా మెగా ఫోన్‌తో వరదలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి సూచనలు ఇచ్చారు. పెద్దచెరువు వరదలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడేందుకు ఎన్‌డిఆర్ఎఫ్ బృందం తీవ్రంగా శ్రమిస్తుండగా స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆదిప్రసాద్, నూజివీడు సీఐ మూర్తి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా ఈ వరదనీరు మొత్తం నూజివీడులోని ప్రధాన వీధులగుండా వెళ్ళటంతో వీధులన్నీ వాగులను తలపించాయి. ఈ వరదనీరు మొత్తం నూజివీడులో గల మొగలి చెరువుకు చేరడంతో ఆ ప్రాంతంలోనూ భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పెద్దచెరువు కళంగి నుంచి వచ్చేనీరు రామిలేరులో కలువడంతో రామిలేరు సైతం పొంగి ప్రవహిస్తోంది. గత 40ఏళ్ళుగా నూజివీడులో ఇలాంటి భారీవర్షం చూడలేదని, స్థానిక ప్రజలు అంటున్నారు. ఇప్పటికే జలదిగ్బంధంలో ఉన్న నూజివీడు, పరిసర గ్రామాలకు వర్షం రూపేణా ప్రమాదం పొంచి ఉంది. వాతావరణశాఖ తెలిపిన వివరాల ప్రకారం రానున్న 24 గంటల్లో మరో 250 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని చెప్పడంతో అదే జరిగితే వరద మరింత పెరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అధికార యంత్రాంగమంతా ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలకు సమాయత్తం అవుతోంది. రాత్రి 8.30 గంటలకు కూడా పెద్దచెరువుకు పడిన గండి ప్రవాహం ఆగకపోవడంతో పల్లపుప్రాంతాల్లో నీరు కాలువలో ఇంకా ప్రవహిస్తూనే ఉంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

ప్రజలకు అసౌకర్యం కలగనివ్వద్దు: మంత్రి

భారీవర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారథి, అధికారులను ఆదేశించారు. పెద్దచెరువుకు వరద కారణంగా నీట మునిగిన పలు ప్రాంతాలను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దచెరువుకు గండి కారణంగా వెలమపేటలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రజలను నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నతపాఠశాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధం చేయటం జరిగిందని, వర్షం నీరు నిల్వ ఉన్న కారణంగా తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రితో ఎస్పీ శివకిషోర్, ఆర్డీవో వై.భవానిశంకరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌కు వచ్చి చిక్కుకుపోయారు..

నూజివీడు మండలంలోని బత్తులవారిగూడెం, అప్పారావుచెరువు, కొత్త చెరువులకు గండిపడి, పంట పొలాలు నీటమునిగాయి. గ్రామంలో రెండు ఇళ్ళు కూలిపోగా, నూజివీడు పెద్దచెరువుకు సైతం గండిపడటంతో నూజివీడు పట్టణంలోని తిరువూరు బస్టాండ్ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఒక్కసారిగా వరదనీరు ఇళ్ళలోకి రావడంతో స్థానికులు తాళ్ళ సహాయంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాల్సి వచ్చింది. తిరువూరు బస్టాండ్ సమీపంలో నివాసం ఉండేవారు దాదాపు 30 కుటుంబాలు నివాసగృహాలను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు నూజివీడు - పోతురెడ్డిపల్లి రహదారి పై గల బాబా ఆలయం వద్ద ఓ ఫంక్షన్‌కు నూజివీడుకు చెందిన పలువురు హాజరు కాగా, శనివారం మధ్యాహ్నం నూజివీడు పెద్దచెరువుకు గండిపడటంతో నీటి వరద ఒక్కసారిగా రామిలేరులోకి రావడంతో ఆలయ పరిసరాలు నీటమునిగాయి. దీంతో టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, పర్వతనేని సాయి, పర్వతనేని వెంకటేశ్వరరావు, శ్రీకాంత్‌లు ఎక్స్‌కవేటర్ సహాయంతో ఫంక్షన్‌కు హాజరైన వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. పెద్దచెరువు వరదనీరు ఒక్కసారిగా రావడంతో సమీపంలోని పశువులను కట్టేసేందుకు వచ్చిన వ్యక్తి తనను తాను రక్షించుకునేందుకు వేపచెట్టు ఎక్కగా, వరద ఉధృతికి వేపచెట్టు సైతం కొట్టుకుపోవడంతో సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఆసరాగా చేసుకుని, వేలాడటం చూసిన స్థానికులు సమాచారాన్ని నూజివీడు పోలీస్‌సిబ్బందికి అందించారు. అతనిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక భారీ వర్షాలకు నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కాలువకు సైతం గండిపడింది. నూజివీడు మండలం దిగవల్లి పరిధిలో ఎన్ఎస్‌పీ వేంపాడు మేజర్‌కు 21వ కిలోమీటర్ వద్ద గండిపడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో రెండురోజులు వర్షాలు పడతాయన్న సమాచారంతో గ్రామస్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పొంగుతున్న వాగులు.. వంకలు

ముసునూరు: మండల వ్యాప్తంగా శనివారం తెల్లవారుజాము నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. చెక్కపల్లిలోని బసవరపుపాడు వాగు ఉగ్రరూపం దాల్చడంతో అంబేద్కర్ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హెల్త్‌క్లినిక్ భవనం చుట్టూ నాలుగు అడుగుల లోతు వరకు నీరు చేరింది. వీఆర్వో పాయాస్, టీడీపీ నాయకులు కాలనీలో సహాయక చర్యలు చేపట్టారు. రమణక్కపేట కుమ్మరివారి బజారులో డ్రైనేజీ ఆక్రమణతో నివాసగృహాలు నీటమునిగాయి. గుడిపాడు, ముసునూరు, కొర్లకుంట తదితర గ్రామాల్లో ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉండటంతో ఇళ్ళలోకి నీరుచేరింది. గుడిపాడు ఊరచెరువు ఆయకట్టులో వరిపంట నీటమునిగింది. వరదనీటికి తమ్మిలేరు సప్లై ఛానల్‌కు పలు చోట్ల గండిపడి నీరు వరి పొలాల్లోకి చేరింది. నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారిలో సింహాద్రిపురం వద్ద ఉన్న రాములేరు వాగు, ముసునూరు-వలసపల్లి ప్రధాన రహదారిలో ఉన్న సంధ్యవాగు, గోగులంపాడు-అక్కిరెడ్డిగూడెం రహదారిలో ఉన్న కట్టుకాలువ, కాట్రేనిపాడు-మీర్జాపురం ప్రధాన రహదారిలో ఎర్రవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ వాగులో వరద ఉధృతికి రెండు బైక్‌లు కొట్టుపోయాయి. ప్రాణాపాయం జరగలేదు. ఈ భారీ వర్షాలకు చెరువులు నిండుతుండటంతో రైతుల్లో హర్షం వ్యక్తమౌతోంది.

చాట్రాయి: అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి చాట్రాయి మండలంలో జన జీవనం స్తంభించింది. పాఠశాలలకు సెలవు ప్రకటించటంతో విద్యార్థులు ఇళ్ళ వద్దే ఉండిపోయారు. కూలీలు పనులకు వెళ్ళలేదు. పంటలకు పెద్దగా నష్టం ఉండదని ఏవో శివశంకర్ చెప్పారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రశాంతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చెరువులు వాగులు సమీపంలోకి వెళ్ళవద్దని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకవద్దని, పిల్లలను కనిపెట్టుకొని ఉండాలని అన్నారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల వద్దకు వెళ్ళేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలని, సమస్య ఉంటే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని కోరారు. గ్రామ రెవెన్యూ అధికారులు తమ గ్రామాల్లో ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పర్యవేక్షించాలని, పొంగే వాగులు, చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం 99086 64621 కు ఫోన్ చేసి సంప్రదించాలని తహసీల్దార్ కోరారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి గ్రామంలో గత వైసీపీ నాయకుల అనాలోచిత నిర్ణయాల వల్ల కొండవాగు ఊరిలోకి మళ్లి ఎస్సీ కాలనీ ముంపునకు గురైంది. దుగ్గిరాల రావమ్మగుడి వెనుక గట్టునుండి పెద్దవర్షం వచ్చినప్పుడు వరద బ్రహ్మ లింగం చెరువుకి మళ్ళుతుంది. అలాంటిది ఊరిలో వైసీపీ నాయకులు ఒంటెద్దు పోకడలతో వరద వెళ్ళేదారిలో తూరలు వేసి వద్దన్న టీడీపీ నాయకులపై కేసులు పెట్టి ఎస్సీ కాలనీవాసులను ఇబ్బంది పెట్టారు. ఇప్పటికిప్పుడు తూములు తొలగించాలంటే ఇరిగేషన్ అధికారులు అనుమతి తప్పనిసరి. తక్షణ కర్తవ్యంగా సర్పంచ్ ఆరేపల్లి శ్రీను, డ్రైన్‌లో పూడిక తీయించి వరదను దళితవాడ నుంచి మళ్ళించారు.


క్యాంపస్‌లో ఫుడ్‌కోర్టు నుంచి చెత్తను సేకరిస్తున్న మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది

సీఎం సీరియస్

(మూడో పేజీ తరువాయి)

ఫుడ్ టెక్నాలజీలో అర్హత ఉన్న వారిని అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించాలని అధికారులకు సూచించాం. ఫ్యాకల్టీ, సెక్యూరిటీ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించే సమయంలో వారికి ఎలాంటి నేరచరిత్ర లేని వారిని మాత్రమే తీసుకోవాలి. దీనికి పోలీసుల సహకారం పొందాలి. విద్యార్థుల సౌకర్యాల విషయంలో స్పష్టమైన మార్పులు రావాలి. నాణ్యమైన ఆహారం, చదువుకోవడానికి చక్కని వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం' అని మంత్రి తెలిపారు.

మళ్లీ అదే ఆహారం.. విద్యార్థుల అసంతృప్తి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మంత్రి, జిల్లా అధికారులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు పలుమార్లు హెచ్చరించినా మెస్ నిర్వాహకులు తీరు మారలేదు. శనివారం కూడా అదే నాణ్యత లేని ఆహారాన్ని అందించారని విద్యార్థులు వాపోయారు. ఆహారం రుచి చూసిన మంత్రి పార్థసారథి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినా మెస్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడానికి కారణంపై విద్యార్థుల్లో తీవ్రంగా చర్చ జరుగుతోంది. మెస్‌ల్లో తమకు అందుతున్న ఆహారాన్ని రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యామ్నాయ పద్ధతులపై దృష్టి పెట్టకుండా మెస్ నిర్వాహకులను బుజ్జగించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. శనివారం ట్రిపుల్ ఐటీలో జ్వరాల బారిన పడి మరో 59 మంది విద్యార్థులు అవుట్ పేషెంట్‌గా చికిత్స పొందారు. ఇప్పటికే వందలాది మంది జ్వరాల బారినపడి కోలుకున్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్లు ఫుడ్ కోర్టుకే..!

ట్రిపుల్ ఐటీ నూజివీడు మున్సిపాలిటీకి ఏటా లక్షలాది రూపాయలు ట్యాక్స్ రూపేణా చెల్లిస్తోంది. పది వేల మంది ఉండే క్యాంపస్‌లో చెత్తా చెదారం తీసుకెళ్ల డానికి పురపాలక సంఘం ట్రాక్టర్లు రావు. కాని, ఇదే క్యాంపస్‌లో ఫుడ్ కోర్టుకు మాత్రం చెత్తను తీసుకెళ్లడానికి ట్రాక్టర్లు వస్తాయి. ఈ ఫుడ్ కోర్టు నడిపేది పురపా లక సంఘం నాయకులు కావడమేనా ? అని విద్యార్థుల ప్రశ్న. మెస్‌లలో అపరిశు భ్రంగా ఉండటమే కాక చెత్తా చెదారం నిండివున్న కుండీలు, డస్ట్ బిన్‌లను స్వయం గా చూసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా వాటిని వెంటనే క్లీనింగ్ చేయించి ఉంటే బాగుండేదని విద్యార్థులు అంటున్నారు.

వర్షాలతో 20 రైళ్ల రద్దు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో విజయవాడ దక్షిణమధ్య రైల్వే డివిజన్‌లో నడుస్తున్న రైళ్ళల్లో 20 రైళ్ళను రద్దు చేస్తూ శనివారం రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల మీదుగా వెళ్ళే రైళ్ళు కూడా ఉన్నాయి.

రైల్ నెంబర్ 17257 విజయవాడ - కాకినాడ పోర్టు ఈనెల 31వ తేదీన రద్దు చేశారు. 07885 భీమవరం జంక్షన్ - నిడదవోలు ఈనెల 31తేదీన రద్దు చేశారు. 07886 నిడదవోలు - భీమవరం జంక్షన్ ఈనెల 31తేదీన రద్దు చేశారు. 07281 నర్సాపుర్ -గుంటూరు ఈనెల 31 తేదీన రద్దు చేశారు. 17269 విజయవాడ - నర్సాపూర్ ఈనెల 31, సెప్టెంబర్1, 2వ తేదీన రద్దు చేశారు.

ఎంపీడీవోకు సత్కారం

ఆగిరిపల్లి, ఆగస్టు 31: ఆగిరిపల్లి మండల పరిషత్ అధికారి పి.శంకర్‌రావు శనివా రం పదవీ విరమణ చేశారు. ఎన్నికల ముందు సాధారణ బదిలీల్లో వేరే ప్రాంతానికి వెళ్ళి ఎన్నికల అనంతరం ఆగిరిపల్లికి యథాస్థానానికి వచ్చారు. ఈయన ఆఖరి పనిదినం ఆగిరిపల్లిలో ముగించారు.

లారీ బోల్తా... తప్పిన ముప్పు

ముసునూరు, ఆగస్టు 31: కొర్లకుంట శివారు నేలపాటివారికుంట వద్ద శుక్రవారం అర్ధరాత్రి లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రాణాపాయం ఏమీ జరగలేదు. కామవరపుకోటలో ఎరువులను అన్‌లోడ్ చేసిన లారీ శుక్రవారం తిరిగి నూజివీడు వెళుతూ అదుపు తప్పి ప్రధాన రహదారి మార్జిన్‌లోకి వెళ్ళడంతో పక్కనే ఉన్న కందకంలోకి బోల్తా కొట్టింది. అయితే డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. శనివారం ఉదయం క్రేన్ సహాయంతో లారీని బయటకు తీశారు.

పేకాట శిబిరంపై దాడి... ఐదుగురి అరెస్టు

కైకలూరు, ఆగస్టు 31: కైకలూరులోని ఓ లాడ్జిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ దాడి చేశారు. శనివారం మధ్యాహ్నం లాడ్జిలో పేకాడుతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.12230లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరంతా అటపాక గ్రామానికి చెందిన వారుగా గుర్తించామన్నారు.


కైకలూరులో రైల్వేగేటు వద్ద నీటమునిగిన రహదారి


కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో వర్షపునీటిలో విధులు


పెదగొన్నూరు శివారు కర్షక దళితవాడలో కూలిన రేకుల షెడ్డు

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు, ఆగస్టు 31: కైకలూరు పట్టణంలో భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఎక్కడ చూసినా డ్రైయిన్లు పొంగిపొర్లడంతో గ్రామాల్లో రహదారులు పూర్తిగా నీటమునిగాయి. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోత వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న రైల్వేగేటు వద్ద వర్షపునీరు భారీగా చేరడంతో ప్రయాణీకుల బాధలు వర్ణనాతీతం. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలోకి వర్షం నీరు చేరడంతో అధికారులు ఆ నీటిలోనే విధులు నిర్వహించారు. కైకలూరు వెలమపేట ఎంపీయూపీ స్కూల్లోకి, కాలనీ, బ్రహ్మంగారిగుడి వీధి, సాయిబాబా గుడి రహదారులు కాలువలను తలపించాయి. జాతీయ రహదారి వెంబడి ఆటపాక, గోనెపాడు, కైకలూరులోని జూనియర్ కళాశాల వద్ద, ఆర్టీసీ బస్టాండ్, గోలీ తోట, టౌన్‌హాలు, రైతుబజారు తదితర ప్రాంతాలు నీట మునిగాయి. కైకలూరు ప్రభుత్వాసుపత్రి వెనుక రహదారి, రైల్వేస్టేషన్‌రోడ్డు, ఎన్జీవోస్ కాలనీ ముంపు బారినపడ్డాయి. శనివారం మధ్యాహ్నం వరకు కైకలూరు మండలంలో 230.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ముందస్తుగానే అధికారులు సెలవులు ప్రకటించారు. కైకలూరులో డ్రైన్లన్నీ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎటూ నీరు పారుదల కాకపోవడంతో సాయంత్రం వరకు రహదారులపైనే వర్షపునీరు నిలబడింది. వెలమపేట కాలనీలో రహదారులు ముంపునకు గురికావడంతో ద్విచక్ర వాహనాలు సైతం నడపలేని పరిస్థితి చోటుచేసుకుంది.

మండవల్లి: మండవల్లిలో శనివారం సాయంత్రానికి 139.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. జాతీయ రహదారి నెం.165 విస్తరణ పనులు రెండేళ్లుగా చేస్తున్నా డ్రెయినేజీ నిర్మాణం పూర్తి కాక భారీ వర్షాలకు జాతీయ రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. కైకలూరు వీధి వద్ద డ్రెయినేజీ అస్తవ్యస్త నిర్మాణం వల్ల మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి రోడ్డుపై గోతులు సైతం కనిపించక ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇళ్లలోకి సైతం నీరు చేరింది. పీహెచ్‌సీ రోడ్డు, వెలంపేట రోడ్డు, కైకలూరు సందు రోడ్డు, శ్రీకృష్ణ ఆలయం పక్క రోడ్డుతో పాటు అనేక రహదారులు ముంపునకు గురయ్యాయి.

కలిదిండి: కలిదిండిలో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కలిదిండి మార్కెట్ యార్డు, ఎంపీడీవో కార్యాలయాల వద్ద రాష్ట్ర రహదారి జలమయం కావటంతో వాహనదారులు పలు అవస్థలు పడ్డారు. పీహెచ్‌సీ ఆవరణ నీటమునగటంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. కలిదిండిలో 150 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి పొలాల్లో భారీ వర్షపునీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపించకుండా నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. అవసరమైతే 9908664641కు ఫోన్ చేయాలన్నారు.

కూలిన ప్రహరీ

ముదినేపల్లి: భారీ వర్షాలకు ముదినేపల్లి జలమయమయింది. గ్రామంలోని రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. రహదారుల వెంబడి ఉన్న పక్కా డ్రైన్లు పూడిపోవటం, రోడ్ల మార్జిన్లు ఆక్రమణలకు గురి కావటంతో వర్షపు నీరు తగ్గటం లేదు. అంబేద్కర్ కాలనీలో అంతర్గత రహదారులు మునిగి నీరు ఇళ్లలోకి చేరింది. కాలనీలో ఒక ఇంటి ప్రహరీ వర్షాలకు కూలిపోయింది. ముదినేపల్లిలోని ఆర్సీఎం చర్చి జల దిగ్బంధంలో చిక్కుకుంది. గుడ్లవల్లేరు రోడ్డు జలమయం కాగా, ముదినేపల్లి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున నీరు నిలిచి ఉంది. పలు వ్యాపార సంస్థలు, హోటళ్లు మూసివేశారు. వడాలి - తాడినాడ రోడ్డులోని గోతుల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా తయారయింది. వర్షాలకు ఆక్వా రైతులు బెంబేలెత్తుతున్నారు. చల్లదనం పెరగటంతో రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ పడిపోయి వైరస్ వ్యాపించే ప్రమాదం ఉందని, ముదినేపల్లి ప్రాంత ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏరియేటర్లను తిప్పినా అంతగా ఫలితం ఉండటం లేదు. కాగా మండలంలోని వేలాది ఎకరాల సార్వా వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలో 17500 ఎకరాల విస్తీర్ణంలో సార్వా వరి సాగు చేయగా, సుమారు 60 శాతం భూములు ముంపు బారిన పడినట్లు సమాచారం. పొలాల గట్లు కూడా కనిపించటం లేదు. మైనర్ డ్రైన్లు, పొలాలు ఏకమయ్యాయి. వర్షాల వల్ల వరి పైరుకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదలంక, పోల్‌రాజ్, పెదకొమ్మిలేరు, తుమ్మిడి - చెన్నూరు మేజర్ డ్రైన్లలో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగింపు పనులు ఇంకా పూర్తి కాకపోవటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామం వద్ద బీఎండీ ఛానల్‌కు గండి పడింది. కాల్వ గట్టు బలహీనంగా ఉండటంతో గండి పడటంతో ఆ గ్రామానికి చెందిన వందలాది ఎకరాల సార్వా వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ సుబానీ గండిని పూడ్పించారు.

మొన్న తోడు కోల్పోయి.. నేడు నీడ కూలి

తోడుగా ఉన్న భర్తను నాలుగు రోజుల క్రితం కోల్పోయి విషాదంలో ఉన్న ఓ మహిళకు వాయుగుండం మరో కష్టాన్ని మిగిల్చింది. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు కర్షక దళిత వాడకు చెందిన మద్దాల మరియమ్మ ఇల్లు శనివారం వర్షాలు, గాలులకు నేలమట్టమయింది. ఆమె భర్త మద్దాల రాధాకృష్ణ (75) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 27న మరణించాడు. అతడు కష్టపడి నిర్మించిన రేకుల షెడ్డు వర్షాలకు కూలిపోయింది. కూలిన షెడ్డును వీఆర్వో ఏడుకొండలు పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు.


చనుబండలో పెన్షన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు


కైకలూరు వెలంపేటలో పెన్షన్ పంపిణీ

పింఛన్ల పంపిణీ

కైకలూరు, ఆగస్టు 31: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కైకలూరు మండలంలో 91 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం ఉదయం భారీ వర్షం కురుస్తున్నప్పటికీ సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారన్నారు. కైకలూరు వెలమపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, సర్పంచ్ నవరత్నకుమారి, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, ఎస్సీసెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, బీజేపీ నాయకుడు కీర్తి వెంకటరాంప్రసాద్, తహసీల్దార్ ఉదయభాస్కర్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మండవల్లి: మండవల్లిలో జన్మభూమి కమిటీ మాజీ సభ్యుడు ముళ్లపూడి సత్తిబాబు, కూటమి నాయకుడు గంగినేని వరప్రసాద్ అల్లినగరంలో టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని చేతలు మీదుగా పెన్షన్ అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం అభినందనీయమని ఒకరోజు ముందుగానే పెన్షన్లు తీసుకున్న వారి కళ్లల్లో ఆనందాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లు గంగునేని వరప్రసాద్ అన్నారు.

కలిదిండి: భారీ వర్షంలో తడుచుకుంటూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటింటికి వెళ్లి 90 శాతం పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేయటంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముదినేపల్లి: జోరు వర్షాన్ని లెక్క చేయకుండా శనివారం ముదినేపల్లి మండలంలో పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేశారు. మహిళా ఉద్యోగులు కూడా వర్షపు నీటిలోనే నడుచుకుంటూ పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. శనివారం 88 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. మండలంలో 9022 మందికి పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 7939 మందికి రూ.3.36 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో మల్లీశ్వరి తెలిపారు. మండలంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నాయకులు దావు నాగరాజు, యర్రా రాంబాబు, వీరంకి వెంకటేశ్వరరావు, బాసినశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


పెదగొన్నూరు, కలిదిండిలలో వానలోనే పింఛన్ల పంపిణీ

చాట్రాయి: మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో 90.22 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. మొత్తం 8463 పెన్షన్లకు గాను 7637 మందికి పెన్షన్లు పంపిణీ చేశామని, మిగతా వారికి సెప్టెంబరు 2న పంపిణీ చేస్తామని చెప్పారు. పెన్షన్ల పంపిణీలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కందుల కృష్ణ, జక్కంపూడి ప్రదీప్, తల్లాడ శ్రీను, పరసా శ్రీను, నక్కా రాము, మారేశ్వరరావు, బొర్రా నాగేశ్వరరావు, బూబత్తుల చెన్నారావు, రత్తయ్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరు మండలంలో 90 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఈవోపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికి సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, వ్యవసాయ సిబ్బంది, కార్యదర్శులు సైతం లబ్ధిదారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్ అందజేశారు. పంపిణీని ఈవోపీఆర్డీ, ఎంపీడీవో కార్యాలయ ఏవో సాయిరాము పరిశీలించారు.

ఆగిరిపల్లి: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వానలోనే అధికారులు పెన్షనర్లకు అందచేశారు. 80 శాతం పూర్తిగా పెన్షన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

పంచాయతీలో అవకతవకలపై డీఎల్పీవో విచారణ

కైకలూరు, ఆగస్టు 31: కైకలూరు పంచా యతీలో జరిగిన అవక తవకలపై పూర్తిస్థాయి లో విచారణ జరిపి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తానని ఏలూరు డీఎల్పీవో కె. పూర్ణచంద్ర శేఖర్ తెలిపారు. కైకలూరు పంచాయతీపై వచ్చిన ఫిర్యాదులపై శనివారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్పీవో విచారణ జరిపారు. కైకలూరు పంచాయతీ సర్పంచ్ డీఎం నవరత్నకుమారి భర్త ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ సచివాలయ భవన నిర్మాణానికి రూ.4.50 లక్షలు నిధులను పంచాయతీ నుంచి తీసుకున్నారని అంతేగాక గతంలో అనేక నిధులు గోల్‌మాల్ అయినట్లు జిల్లా కలెక్టర్‌కు పంచాయతీ వార్డు సభ్యులు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీఎల్పీవో విచారణ చేపట్టారు. గతంలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన దూలం లక్ష్మీనారాయణ, కేఎస్ఎస్ రామలక్ష్మీ, వార్డు సభ్యులను వేరువేరుగా ఆయన విచారించారు. ఈ విషయమై డీఎల్పీవో మాట్లాడుతూ విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు పాల్గొన్నారు.

పామాయిల్ విస్తీర్ణాన్ని పెంచాలి : మంత్రి సారథి

నూజివీడు టౌన్, ఆగస్టు 31: పామాయిల్ విస్తీర్ణాన్ని పెంచే దిశగా ఉద్యానవన శాఖ అధికారు లు చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి సూ చించారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామం లో రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రస్తుతం 15వేల హెక్టార్‌లలో పామాయిల్ సాగవుతోందని, మరో 2వేల హెక్టార్‌లలో విస్తరించే దిశగా ఉద్యానవన శాఖ చర్యలు చేపడుతోందన్నారు. నూజివీడు మండలంలో 600 హెక్టార్‌లలో మిగిలిన మూడు మండలాల్లో 1400 హెక్టార్‌లలో పామాయిల్‌ను విస్తరించాలనేది లక్ష్యమని ఉద్యానవనశాఖ డీడీ రామ్మోహన్‌రావు మంత్రికి తెలిపారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే లక్ష్యంతో వ్యవసాయ అనుబంధ శాఖలను ఒకతాటిపైకి తీసుకువచ్చి రైతులకు సలహాలు, సూచనలు అందించే దిశగా పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు మంత్రి పార్థసారథి అన్నారు. దీని ద్వారా ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖలతో కలిపి గ్రామాల్లో క్షేత్రస్థాయి సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా, ఏడీఏ జి.విద్యాసాగర్, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నూజివీడు డివిజన్‌లో 398 మి.మీ. వర్షపాతం

నూజివీడు టౌన్, ఆగస్టు 31: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా 398 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు ఆర్డీవో వై.భవాని శంకరి తెలిపారు. అత్యధికంగా ముసునూరు మండలంలో 126 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చింతలపూడిలో 16 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. లింగపాలెంలో 94.4, నూజివీడులో 88.6, ఆగిరిపల్లిలో 40.6, చాట్రాయిలో 32.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.